సాక్షి ఖమ్మం

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



‘పీఎంశ్రీ’ స్కూళ్లకు కంప్యూటర్లు

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 46స్కూళ్లలో బోధన కోసం కంప్యూటర్లను కేటాయించారు. 8లో



ఇంకెంత మంది చనిపోవాలి?

సత్తుపల్లి మండలంలోని సింగరేణి సైలో బంకర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో చేపట్టిన దీక్షలు పదో రోజుకు చేరాయి. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లా అంతటా శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ పోలింగ్ సజావుగా సాగేలా ఏర్పాట్లు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగకుండా సాఫీగా ముగిసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధులపై సందేహాలు ఉంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. గతంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన అనుభవం ఉన్నప్పటికీ ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండొద్దని చెప్పారు. అనంతరం మాస్టర్ ట్రెయినీలు రాజేశ్వరి, ఎస్.మాధవి బ్యాలెట్ బాక్సుల సీల్, పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మంటల నియంత్రణకు సహకరించాలి




గ్రామస్తులతో సమావేశమైన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

కారేపల్లి: రానున్న ఎండాకాలంలో అటవీ ప్రాంతాన మంటల చెలరేగే అవకాశమున్నందున నియంత్రణకు రైతులు సహకరించాలని జిల్లా అటవీ శాఖాధికారి(డీఎఫ్‌ఓ) సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ సూచించారు. మండలంలోని తవిసిబోడులో గురువారం రైతులతో ఆయన సమావేశమయ్యారు. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి వివాదాలు, వ్యవసాయ క్షేత్రాలకు రోడ్డు సౌకర్యం, కోతుల బెడద తదితర అంశాలను రైతులు డీఎఫ్‌ఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా సిద్ధార్థ్ మాట్లాడుతూ అటవీ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములకు హద్దులు నిర్ధారిస్తామని చెప్పారు. అలాగే, వన్యప్రాణులు అడవి దాటి రాకుండా పండ్ల మొక్కలు నాటుతామన్నారు. రైతులకు సౌర శక్తితో నడిచే బోర్ మోటార్ల సరఫరాకు ఐటీడీఏ అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కాగా, అడవిలో మంటలు చెలరేగినప్పుడు సమాచారం ఇచ్చి అటవీ సంపదను కాపాడడంలో పాలుపంచుకోవాలని ఆయన కోరారు. ఇదేసమయాన స్థానికులు వాస్తవాలను అర్థం చేసుకుని అటవీ సంరక్షణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అటవీ శాఖ అధికారి మంజుల పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ఈ ప్రకటనతో దరఖాస్తుదారులు ముందుకొస్తారని భావిస్తుండగా.. భారీగా పేరుకుపోయిన దరఖాస్తుల పరిశీలన అరకొరగా ఉన్న సిబ్బందికి భారంగా మారుతుందని చెబుతున్నారు. ఈఏడాది మార్చి 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తయితే 25శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మున్సిపాలిటీలు, సుడా, గ్రామ పంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేరు. దీంతో పరిశీలన పూర్తవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఈసారైనా

ఎల్‌ఆర్‌ఎస్ అనేనా?!

- జిల్లాలో 99,747ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో 8,916కే అనుమతి
- సిబ్బంది కొరతతో ఏళ్లుగా నత్తనడకన పరిశీలన
- తాజాగా రాయితీ ప్రకటించిన ప్రభుత్వం

మున్సిపాలిటీల్లోనూ ముందుకు పడలే..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఖమ్మం కార్పొరేషన్, మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లో 51,425 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 8,851 అనుమతి పొందగా.. 339 దరఖాస్తులను తిరస్కరించారు. గతంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నవి 53 ఉండగా, సరైన డాక్యుమెంట్లు లేని కారణంగా 2,035 దరఖాస్తులను పక్కన పెట్టారు. అలాగే, నిషేధిత సర్వే నంబర్లలోనివి 5,946 ఉన్నాయి. కాగా, మూడు దశల్లో భాగంగా ఎల్–1లో 33,302, ఎల్–2లో 259, ఎల్–3 దశకు 51 దరఖాస్తులు చేరాయి. మున్సిపాలిటీల్లో ఫీజు చెల్లింపునకు 8,851 దరఖాస్తులు అనుమతి పొందినా 1,146 దరఖాస్తులకే ఫీజు చెల్లించారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే మున్సిపాలిటీల్లో దరఖాస్తుల పరిశీలన, ఫీజు చెల్లింపు ప్రక్రియ ముందుకు పడడం లేదని స్పష్టమవుతోంది.

సుడా, జీపీల్లో ఎక్కడివి అక్కడే..

దరఖాస్తుల పరిశీలనలో సుడా, గ్రామపంచాయతీలు పూర్తిగా వెనుకబడ్డాయి. సుడా(స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలో 34,391 దరఖాస్తులు వస్తే ఇందులో కేవలం ఏడు మాత్రమే అనుమతి పొందగా.. 853 దరఖాస్తులను నిషేధిత జాబితాలో పెట్టారు. ఇక అనుమతి లభించిన ఏడింట్లో నాలుగింటికే ఫీజు చెల్లింపు పూర్తయింది. గ్రామ పంచాయతీల్లో 13,931 దరఖాస్తులు అందగా 58 దరఖాస్తులకు అనుమతి ఇస్తే ఒక దరఖాస్తుకే ఫీజు చెల్లించారు. మరో 571 దరఖాస్తులను నిషేధిత జాబితాలో పెట్టగా, 13,235 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఒక్కో దశ దాటితేనే..

తొలుత సీజీజీ(సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తారు. ఆపై మొబైల్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో రెవెన్యూ గ్రామం లేదా మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన బృందం పరిశీలన చేపట్టాలి. ఈ బృందం జీపీఎస్ ద్వారా సదరు భూమి హద్దులు, ఇతర సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తుంది. అదే సమయాన భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ భవనాలు, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలో లేవని ధ్రువీకరించాలి. ఇదంతా మూడు దశల్లో జరగాల్సి ఉన్నా చాలా సమయం పడుతోంది.



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తుల సమాచారం తెలుసుకుంటున్న స్థల యజమానులు

ఊరటనిచ్చేలా రాయితీ

ఏళ్లుగా పెండింగ్ ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ దరఖాస్తుదారులకు కలిసొస్తుంది. ఒక ప్లాట్‌కు సంబంధించి రోడ్లు, పైపులైన్లు, ఇతర సౌకర్యాలు లేకుండా ఏర్పాటుచేసినందుకు ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు విధిస్తుంటారు. వీటితోపాటు గ్రీన్‌ల్యాండ్‌కు 10 శాతం స్థలాన్ని ఇవ్వనందుకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం విలువను లెక్కించి దానిపై 14 శాతం చార్జీ విధిస్తారు. ఈ రెండూ చెల్లిస్తేనే యజమానికి స్థలం రెగ్యులరైజ్ అవుతుంది. మొత్తంగా రాయితీతో దరఖాస్తుదారులకు ముందుకొచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఇదే సమయాన అదనపు సిబ్బందిని కేటాయించాలనే సూచనలు వస్తున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీలు	దరఖాస్తులు	అనుమతి	ఫీజు చెల్లింపు
ఖమ్మం కార్పొరేషన్	39,942	3,735	939
మధిర మున్సిపాలిటీ	4,276	1,488	97
సత్తుపల్లి మున్సిపాలిటీ	3,688	2,391	62
వైరా మున్సిపాలిటీ	3,516	1,237	48
సుడా పరిధి	34,391	07	04
గ్రామపంచాయతీలు	13,931	58	01
మొత్తం	99,747	8,916	1,151

పరిశీలనే అసలు సమస్య

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన యంత్రాంగానికి సవాల్‌గా మారింది. మున్సిపాలిటీల్లో దరఖాస్తుల పరిశీలన ఒకింత నత్తనడకన సాగుతున్నా.. సుడా, గ్రామపంచాయతీల్లో మాత్రం పూర్తిగా పడకేసింది. సుడాకు క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొనగా, జీపీల్లో కార్యదర్శులు, ఆ తర్వాత మండల స్థాయిలో జరగాల్సిన పరిశీలన కూడా మందగించింది. ఈసారి ప్రభుత్వం ఫీజులో రాయితీ ప్రకటించి, మార్చి 31వరకు గడువు విధించిన నేపథ్యాన పరిశీలనకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తేనే ఫలితం ఉంటుందని భావిస్తున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక ‘దృష్టి’

- గతంలోనే కంటి సమస్యలు ఉన్న వారి గుర్తింపు
- 3,557 మందికి నిపుణులతో మరోమారు పరీక్షలు
- అవసరమైన వారికి అద్దాల పంపిణీ

సత్తుపల్లి టౌన్: తరగతి గదిలో బోర్డు సరిగ్గా కనిపించకపోవడం, పోషకాహార లోపంతో ఎదురవుతున్న కంటి సమస్యలు, కళ్ల మంటలు, తలనొప్పి, ఎక్కువ సేపు చదవలేకపోవడం... వంటి సమస్యలతో పలువురు విద్యార్థులు సతమతమవుతున్నారు. పిల్లలు ఎక్కువసేపు సెల్‌ఫోన్లు, టీవీ చూస్తుండడంతో ఇలా జరుగుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద ఇప్పటికే రెండు విడతలుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే 1,11,557 మంది విద్యార్థులకు 12 వైద్య బృందాలతో కొన్నాళ్ల క్రితం కంటి పరీక్షలు చేయించింది. వీరిలో 3,557 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు తేలింది.

మూడో విడత నిపుణులతో..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో 5నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు తొలి రెండు దశల్లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు ఈనెల 17నుంచి నిపుణులతో పరీక్షలు చేయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రితో పాటు సత్తుపల్లి, నేలకొండపల్లి ఏరియా ఆస్పత్రుల్లో కంటి వైద్య నిపుణులతో నిర్వహిస్తున్న పరీక్షలు వచ్చేనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయి. ఒక్కో ఆస్పత్రిలో రోజుకు 50 నుంచి 100 మంది చొప్పున విద్యార్థులకు పరీక్షలు చేయించేలా కార్యాచరణ రూపొందించారు. ఆపై కంటి శుక్లాలు, కంటి చూపు సమస్యలను నిర్ధారించి దృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకొచ్చి, తిరిగి తీసుకెళ్లడానికి ఆర్‌బీఎస్‌కే వాహనాలను వినియోగిస్తున్నారు.



సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రాథమిక పరీక్షలు	1.11 లక్షల మందికి..
పరీక్షలు చేసిన వైద్యబృందాలు	12
దృష్టి లోపం ఉన్న విద్యార్థులు	3,557
స్క్రీనింగ్ చేసే ఆస్పత్రులు	03

నేరుగా కూడా తీసుకురావొచ్చు



రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద గుర్తించిన విద్యార్థులకు నిపుణులతో కంటి పరీక్షలు చేయిస్తున్నాం. అయితే, వీరే కాకుండా దృష్టి సమస్యతో బాధపడే విద్యార్థులను తల్లిదండ్రులు నేరుగా స్క్రీనింగ్ పరీక్షలకు ఉపాధ్యాయుల ద్వారా తీసుకురావొచ్చు. విద్యార్థుల్లో దృష్టి సమస్యలను నివారించాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం.

– టి.సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సత్తుపల్లి

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

ఖమ్మంరూరల్: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలోని పీహెచ్‌సీని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించాక వారితో సమావేశమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండడమే కాక మర్యాదపూర్వకంగా మెలగుతూ వైద్యసేవలు అందించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌లో భాగంగా 30ఏళ్లు నిండిన ప్రతీఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు చేయాలని తెలిపారు. డాక్టర్ బాలకృష్ణ, ఉద్యోగులు వెంకటనారాయణ, చంద్రకళ, ఆజాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

కరెంట్ పోయిందా.. మేమొస్తాం..



జిల్లాకు కేటాయించిన అత్యవసర వాహనాలు

- విద్యుత్ శాఖకు ఆరు వాహనాల కేటాయింపు
- వేగంగా సమస్యలు పరిష్కరించేలా సిబ్బంది నియామకం

ఖమ్మంవ్యవసాయం: అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా జిల్లాకు ఎన్పీడీసీఎల్ ఆరు వాహనాలను కేటాయించింది. ఖమ్మం డివిజన్, వైరా డివిజన్లలో మూడు చొప్పున వీటిని వినియోగించనున్నారు. వేసవిలో ఈదురుగాలులు, ఇతర సమస్యలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎదురయ్యే అవకాశముంది. ఈ సమయంలో సమాచారం అందగానే ప్రత్యేక వాహనాల్లో సిబ్బంది వెళ్లి సమస్యలను పరిష్కరించనున్నారు. వేసవిలో నాలుగు నెలల పాటు ఒక్కో వాహనానికి ఆరుగురు సిబ్బందిని కేటాయించి నెలలో 25రోజులకు గాను రోజువారీ వేతనాన్ని ఏజెన్సీ ద్వారా అందిస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, చెడిపోవడం, ఇతర సమస్యలు తలెత్తినా లేదా సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో సిబ్బంది సామగ్రితో సహా వాహనంలో వెళ్లి మరమ్మతు చేశాక సరఫరాను పునరుద్ధరిస్తారు. అలాగే, వ్యవసాయ భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు, రైతులే సొంతంగా వాహనాలపై తీసుకురావాల్సి వస్తోంది. ఇకపై అత్యవసర వాహనాల్లో వీటిని తీసుకొచ్చి మరమ్మతుల అనంతరం తీసుకెళ్లి బిగించనున్నారు.

1912కు ఫోన్ చేయండి..

విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలందించేలా వారి సమస్యలను తెలిపేందుకు 1912 నంబర్‌ను వినియోగించుకోవాలని ఎస్‌ఈ ఏ.సురేందర్ ఓ ప్రకటనలో సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, లో ఓల్టేజీ, బ్రేక్ డౌన్, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్ల సమస్యలే కాక బిల్లుల్లో హెచ్చుతగ్గులు, సర్వీసుల్లో పేర్ల మార్పు, నూతన సర్వీసుల మంజూరు వంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు 24గంటల పాటు అందుబాటులో ఉండే ఈ నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు. ఈ నంబర్‌కు వచ్చే ఫోన్ల ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారాన్ని ప్రత్యేక సెల్ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు.

అనుమతి.. మాకు అవసరం లేదు!

ఖమ్మం ఇందిరానగర్ ప్రాంతంలో ఓ భవన యజమాని సెల్లార్‌తో పాటు రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకున్నాడు. ఆతర్వాత సెట్ బ్యాక్ కాకుండానే అనుమతికి మించి రెండు ఫ్లోర్లు అదనంగా నిర్మించాడు. స్లాబ్‌ల నిర్మాణం పూర్తయ్యాక కేఎంసీ అధికారులు పనులను అడ్డుకున్నారు. అదనపు నిర్మాణాలకు అనుమతి తీసుకోవాలని నోటీసులు జారీ చేశారు. ఇలా ఖమ్మంలో మాత్రమే కాదు జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లోనూ పలువురు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు.

- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- అనుమతి తీసుకున్నా అంతకు మించి కట్టడాలు
- అయినా చోద్యం చూస్తున్న అధికారులు
- ఫిర్యాదులు అందితే నోటీసులతోనే సరి



ఖమ్మం ఇందిరానగర్‌లో అనుమతికి విరుద్ధంగా స్లాబ్‌లు వేసిన భవనం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ప్రధాన నగరాల తర్వాత అత్యధిక జనాభా నివసించే నగరంగా ఖమ్మం నిలుస్తోంది. విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వస్తున్న వారితో జిల్లాలోని ఖమ్మంతో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లోనూ జనాభా.. అందుకు అనుగుణంగా నిర్మాణాల సంఖ్య పెరుగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నిబంధనలను బేఖాతరు చేస్తూ చేపడుతున్న నిర్మాణాలతో భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. కొందరు పూర్తిగా అనుమతులు తీసుకోకపోగా.. ఇంకొందరు గ్రౌండ్ ఫ్లోర్ వరకే అనుమతి తీసుకుని ఆపై రెండు, మూడు అంతస్తులు నిర్మిస్తున్నారు. మరికొందరైతే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి మరీ నిర్మాణాలు చేపడుతుండడం గమనార్హం.

విద్యుత్ కనెక్షన్లు, ఇంటి నంబర్లు

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడం లేదు. పాలకులు సీరియస్‌గా తీసుకున్నా.. అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా వాణిజ్య, నివాస ప్రాంతాల్లో నిర్మాణాల సంఖ్య రెట్టింపు స్థాయికి చేరింది. ఎక్కడ చూసినా మూడు నుండి ఐదు అంతస్తుల భవనాలే కనిపిస్తున్నాయి. ఇక వాణిజ్య ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలు అడ్డగోలుగా జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. 168 జీఓ ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ చట్టం చెబుతున్నా యజమానులు పట్టించుకోవడం లేదు. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు అటు విద్యుత్ అధికారులు కనెక్షన్లు ఇస్తుండగా.. రెవెన్యూ విభాగ అధికారులు నంబర్లను కేటాయిస్తుండడం గమనార్హం.

కనిపించడం లేదా?

వాణిజ్య, నివాస ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చేపడుతున్న నిర్మాణాలు, పార్కింగ్ సౌకర్యం కూడా లేదని తెలిసినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే బైపాస్ రోడ్డు, బస్టాండ్లు, పాఠశాలలు, మార్కెట్ల వద్ద ఒకటి, రెండు ఫ్లోర్లకు అనుమతి తీసుకొని, ఆపైన అదనపు నిర్మాణాలు చేపడుతున్నారు. కనీసం పార్కింగ్ సౌకర్యం లేకుండా సెల్లార్‌లో సైతం నిర్మాణాలు చేపడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.

సెట్ బ్యాక్ లేకుండానే..

చాలాచోట్ల కనీసం సెట్‌బ్యాక్ కూడా లేకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సెట్ బ్యాక్ లేకుండా భవనాలు నిర్మిస్తున్నట్లు వందల సంఖ్యలో కేఎంసీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పు ఆధారంగా సెట్ బ్యాక్ కావాలి. నలభై అడుగుల లోపు వెడల్పు రోడ్డు పక్కన 240 గజాల స్థలంలో చేపట్టే నిర్మాణాలకు ముందు భాగాన కనీసం ఐదు అడుగులు సెట్‌బ్యాక్ కింద వదలాలి, ఇక మిగిలిన మూడు వైపులా మూడు అడుగులకు పైగా సెట్ బ్యాక్ వదలాలి. అలాగే, వంద అడుగుల రోడ్డు పక్కన 400 – 500 గజాల్లోపు స్థలంలో నిర్మించే భవనాలైతే ముందు భాగంలో 20 అడుగుల సెట్‌బ్యాక్ వదలాల్సి ఉన్నా ఎవరూ పాటించడం లేదు.

అప్పుడప్పుడే దృష్టి

జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన భవనాలపై, ప్రభుత్వ భూములు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై అధికారులు ఇటీవల దృష్టి సారిస్తున్నారు. వైరాలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించి గత సెప్టెంబర్‌లో తొలగించారు. ఖమ్మం ఎన్‌ఎస్‌టీ రోడ్డు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తి గోడ నిర్మించగా కూల్చివేశారు. ఇంకొన్ని చోట్ల అదనపు నిర్మాణాలను తొలగించారు. అలాగే, అనుమతి లేని నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. అయితే, ఫిర్యాదు అందితేనే అధికారులు రంగంలోకి దిగుతున్నారనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తే అక్రమ కట్టడాలను ముందుగానే అడ్డుకోవచ్చు. కానీ నిర్మాణం చివరి దశలో ఉన్నప్పుడో, పూర్తయ్యాకో నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. ఒక్కోసారి కూల్చివేస్తున్నారు.

వంద రెట్లు జరిమానా విధిస్తాం



ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే వెంటనే తొలగిస్తాం. ప్రైవేట్ స్థలాల్లోనైతే అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే వంద రెట్ల జరిమానా విధించి ఆస్తి పన్ను వసూలు చేస్తాం. అంతేకాక మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతి తీసుకున్నాకే అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలి.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

22నుంచి ఆల్‌ఇండియా టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ



వివరాలు వెల్లడిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆల్ ఇండియా టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ నిర్వహించనున్నట్లు టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చల్లపల్లి రాధమ్మ స్మారకార్థం నిర్వహించే టోర్నీ వివరాలను ఆయనతో పాటు అసోసియేషన్ బాధ్యులు ఎం.వెంకట్, డాక్టర్ కె.అనిల్, కె.సత్యనారాయణ, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి గురువారం వెల్లడించారు. ఈనెల 22నుంచి మార్చి 1వరకు టోర్నీ నిర్వహించనుండగా 145 ఎంట్రీలు అందాయని తెలిపారు. ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్‌కు చెందిన చీఫ్ రిఫరీ ప్రవీణ్ నాయక్ డ్రాలు ఖరారు చేస్తారని చెప్పారు. అలాగే, స్టేడియంలోని మూడు కోర్టుల్లో మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

కోయచలకలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన



కోయచలకలో పంటలను పరిశీలిస్తున్న మ్రిణాల్‌శ్రేష్ఠ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం కోయచలకలో అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల వారి ఇళ్లకు వెళ్లి జీవన స్థితిగతులు, పంటల సాగు, ఆర్థిక వనరులపై ఆరా తీశారు. ఉన్నత విద్య పూర్తిచేసిన భువనేశ్వరి తదితరులతో మాట్లాడి భవిష్యత్ ప్రణాళికలు తెలుసుకున్నారు. అనంతరం చెరుకూరి రామారావు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించి దిగుబడి, ధరలపై చర్చించారు.వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజ్యలక్ష్మి, ఆదాం, నాగరాజు, లింగరాజు, సీమా, నరేష్, మార్కెట్ డైరెక్టర్ చెరుకూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖమ్మం, కల్లూరు, మణుగూరు జట్ల విజయం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం నిర్వహించిన మ్యాచ్‌ల్లో ఖమ్మం అర్బన్, కల్లూరు, మణుగూరు జట్లు ముందంజలో నిలిచాయి. ఖమ్మం అర్బన్ – వైరా జట్ల నడుమ మ్యాచ్‌లో అర్బన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 112 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వైరా 107 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. కల్లూరు – ముదిగొండ మధ్య మ్యాచ్‌లో ముదిగొండ జట్టు 77 పరుగులు చేయగా, కల్లూరు జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే, మూడో మ్యాచ్‌లో మణుగూరు–సత్తుపల్లి తలపడగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన మణుగూరు జట్టు 113 పరుగులకు ఆలౌట్ అయింది. ఆతర్వాత సత్తుపల్లి 106 పరుగులకే ఆలౌట్ కావడంతో మణుగూరుకు విజయం దక్కింది. ఈమేరకు పోటీలను టోర్నీ ఆర్గనైజర్ ఎం.డీ.మతిన్ తదితరులు పర్యవేక్షించారు.

జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గాను జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఈనెల 20నుంచి వికారాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనే జట్ల వివరాలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్‌బాబు గురువారం వెల్లడించారు. ఈసమావేశంలో ఎస్.కే.ఇమామ్, ఉమ్మినేని కృష్ణ, ఊటుకూరి రంజిత్, ప్రసాద్, సుధాకర్, శివ పాల్గొనగాక్రీడాకారులకు కిట్లు అందజేశారు. కాగా, బాలురు జట్టుకు ఎం.సాంబశివరావు, బి.శరత్, సీహెచ్.ఆనంద్, జి.సోను, ఏ.నితిన్, యు.వెంకటకృష్ణ, బి.మనోజ్, జి.గణేష్, బి.రాఘవ, జి.హరి, ఎం.శివప్రసాద్, పి.వేణు, డి.అశోక్, బాలికల జట్టుకు బి.హనీ, ఎస్.కే.నాగహసీనా, టి.మేఘన శరణ్య, ఐ.కృష్ణవేణి, ఎస్.కే.రిజ్వానా, వై.నిఖిత, జి.శైలజ, బి.భావన, ఎస్.కే.పర్వీన్, బి.భాను, ఎస్.ప్రవీణ ఎంపికయ్యారని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు

కొత్తగూడెంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు శుక్రవారం కొత్తగూడెం రామవరంలోని తెలంగాణ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ తెలిపారు. అండర్–10, 12, 14, 17 విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో రావాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

ఆలయాల నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం


విరాళం అందచేస్తున్న దాతలు

కల్లూరురూరల్: కల్లూరు మండలం లక్ష్మీపురం (రాళ్ల బంజరు)లో సంత్ సేవాలాల్, మారెమ్మ ఆలయాల నిర్మాణానికి చిక్కుల అనసూర్య, ఆమె కుటుంబీకులు వెంకట రామారావు, రమేష్, మురళీకృష్ణ, గంధం స్వరాజ్యలక్ష్మి గురువారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. అలాగే, గ్రామానికి చెందిన గుగులోతు లక్ష్మి ఆలయ నిర్మాణం కోసం ఒక కుంట స్థలం విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళాలు


ఎలగొండ స్వామి కుటుంబానికి రశీదు అందచేస్తున్న ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందచేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం వాసి తుపాకుల ఎలగొండ స్వామి – రమాదేవి దంపతులు రూ.లక్ష, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ వాస్తవ్యులు పీ.వీ.కృష్ణమూర్తి – జ్ఞానద దంపతులు రూ.1,00,116ను ఆలయ అధికారులకు అందచేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాసులుతో దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)


	గరిష్ట	కనిష్ట
పెసలు	6,400	6,400
కందులు	6,600	6,600
మిర్చి	14,050	6,000
మిర్చి తాలు	6,600	6,000
పత్తి	6,850	5,000

– ఖమ్మం వ్యవసాయం


అటు అందం.. ఇటు సందేశం

వాల్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట గోడలపై అందమైన పెయింటింగ్‌లు వేయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలపై వేయిస్తున్న ఈ పెయింటింగ్‌లు అందంగానే కాక ఆలోచింపచేసేలా ఉంటున్నాయి. మొక్కల ఆవశ్యకత, వనాలు లేకపోతే ఎదురయ్యే అనర్థాలు, పల్లె వాతావరణం, రైతులతో కూడిన చిత్రాలే కాక సైనికుల చిత్రాలు వేయిస్తున్నారు. అలాగే, స్టేడియం వద్ద గోడలపై ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు వేయిస్తూ ఔత్సాహిక క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మంలోని బస్‌డిపో రోడ్డు, వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, పీజీ కళాశాల తదితర ప్రాంతాల్లో ఈ చిత్రాలు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిని ఆకట్టుకోవడమే కాదు ఆలోచింపచేస్తున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఎడ్లబండిపై పంట తీసుకొస్తున్న రైతు కుటుంబం


మొక్కలు నాటాలని సందేశమిస్తూ..


చెట్లు నరికితే ఎదురయ్యే అనర్థాలపై..

సైనికుల త్యాగాలను వివరిస్తూ..




ట్రాఫిక్ నిబంధనలపై..

ఇంకొందరికి తోడ్పాటునివ్వాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరడం ద్వారా ఇంకొందరి ఎదుగుదలకు తోడ్పాటునివ్వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని శాంతినగర్ ఏఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా అవసరమైన శిక్షణ, పుస్తకాల కొనుగోలుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ బాధ్యులు రూ.3.80 లక్షల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు చదువుకుంటూ మంచి స్థాయికి చేరాలని సూచించారు. ప్రధానంగా ఆడపిల్లలు చదువును ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. కాగా, తన భార్య కూడా మలబార్ సంస్థ వ్యవస్థాపకుల స్వస్థలమైన కాలికట్ వాసి అని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్‌కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ బాధ్యులు విష్ణు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఐఈఓ, సంస్థ ప్రతినిధులు

ఇంకెంత మంది చనిపోవాలి ?


మృతుల ఫొటోలతో దీక్షలో పాల్గొన్న కుటుంబీకులు

సైలో బంకర్‌పై కొనసాగుతున్న దీక్షలు

సత్తుపల్లిరూరల్: సింగరేణి గనుల వద్ద ఏర్పాటుచేసిన సైలో బంకర్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నందున తొలగించాలనే డిమాండ్‌తో సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా పదో రోజైన గురువారం శ్వాసకోశ వ్యాధులతో మృతి చెందిన వారి ఫొటోలతో కుటుంబీకులు దీక్షలో పాల్గొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ ప్రాణాలకు ముప్పుగా మారిన సైలో బంకర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

హాస్టల్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

కారేపల్లి: కారేపల్లిలో బీసీ బాలుర వసతి గృహం నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగా, నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే, ఈ స్థలంలో ఏర్పాటుచేసిన బోర్డును కొందరు తొలగించడం, అక్కడ గద్దెల నిర్మించడంతో బీసీ సంక్షేమ శాఖ డివిజనల్ అధికారి ఈదయ్య గురువారం పరిశీలించా రు. స్థల ఆక్రమణకు యత్నిస్తే చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈవిషయమై తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. త్వరలోనే హాస్టల్‌కు కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట మధిర అధికారి డి.నర్సయ్య, హాస్టల్ వార్డెన్ వేణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.


స్థలంలో బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఉద్యోగులు

తహసీల్ ఎదుట వృద్ధురాలి దీక్ష

మధిర: ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం ఆరోపిస్తూ ఓ వృద్ధురాలు తహసీల్ ఎదుట గురువారం నిరసన దీక్ష చేపట్టింది. మండలంలోని దెందుకూరుకు చెందిన కనకపూడి కరుణమ్మ ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఇటీవల తహసీల్దార్ రాంబాబుకు ఫిర్యాదు చేసింది. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దీక్షకు దిగినట్లు తెలిపింది. ఆక్రమణకు గురైన తన స్థలాన్ని ఇప్పించాలని లేకపోతే చనిపోవడానికి అనుమతి ఇప్పించాలని కోరింది. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా కరుణమ్మ ఫిర్యాదుతో సంబంధిత వ్యక్తులకు 15 రోజుల గడువుతో నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఈనెల 22వ తేదీతో గడువు ముగియనుండగా ధ్రువపత్రాలు కలిగిన వారికి స్థలాన్ని అప్పగిస్తామని వెల్లడించారు.


తహసీల్ ఎదుట దీక్షలో కరుణమ్మ (ఎడమ)

ప్రమాదవశాత్తు కాల్వలో పడి హోంగార్డు మృతి


నరేష్ (ఫైల్)

నేలకొండపల్లి: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన హోంగార్డు ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడడంతో మృతి చెందాడు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న గంటా నరేష్(37) గురువారం ఉదయం నందిగామ బ్రాంచి కెనాల్ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. బైక్, దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ కాల్వ కట్టపై ఉంచి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో కాల్వలో పడిపోయాడు. అయితే, నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో హైడల్ పవర్ ప్రాజెక్ట్ వరకు కొట్టుకెళ్లిన ఆయన ఊపిరాడక మృతి చెందాడు. ఆతర్వాత లాక్‌ల వద్ద మృతదేహాన్ని గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని బయటకుతీయించారు. ఆయనకు భార్య నాగశ్రీతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కూసుమంచి, ముదిగొండ సీఐలు సంజీవ్, మురళి, ఎస్సైలు సంతోష్, లక్ష్మణ్‌రావు, నవీన్, రవి, గౌతమ్, హోంగార్డు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్ తదితరులు నరేష్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పోక్సో కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

రూ.2.10 లక్షల చొప్పున జరిమానా

ఖమ్మంఅర్బన్: ఇంటి బయట ఆడుకుంటున్న పన్నెండేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరికి జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2.10లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది. ఖమ్మం మొదటి అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి గురువారం వెల్లడించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక 2021 ఫిబ్రవరి 7న ఇంటి బయట ఆడుకుంటుండగా వచ్చిన ఇద్దరు మాయమాటలతో బలవంతంగా మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి ఖమ్మం శివారు నిర్మానుష్య ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆతర్వాత ఇంటికి చేరుకున్న బాలిక ఇచ్చిన సమాచారంతో ఆమె తల్లిదండ్రులు ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా ఖమ్మం రమణగుట్టకు చెందిన ఆటోడ్రైవర్ కాలేపల్లి సంపత్, ఖమ్మం మంచికంటినగర్‌కు చెందిన పెయింటర్ పసువుల నవీన్‌ను నిందితులుగా గుర్తించి పోక్సో కేసు నమోదు చేశాక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు కేసు విచారణలో నేరం రుజువు కాగా సంపత్, నవీన్‌కు జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. కేసు పకడ్బందీగా వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్, విచారణలో కీలకంగా వ్యవహరించిన అప్పటి, ప్రస్తుత సీఐలు వెంకన్నబాబు, భానుప్రకాశ్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, నాగేశ్వరరావును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. పోలీసులు జగన్నాధపురం సమీపాన చేపట్టిన తనిఖీల్లో అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ట్రాక్టర్లను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చోరీ ఘటనలో నిందితుల ఫొటోలు విడుదల



నిందితుల సీసీ ఫుటేజీ చిత్రాలు

వైరా: వైరాలో ఈనెల 12న ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బంధించి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలో సీసీ ఫుటేజీల ద్వారా నిందితుల చిత్రాలు, వారు ఉపయోగించిన కారు ఫొటోను పోలీసులు సేకరించారు. ఈమేరకు ఫొటోల ఆధారంగా నిందితులను ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం ఏసీపీ రెహమాన్ సూచించారు. నిందితులు నలుగురు తెలుపు రంగు స్విఫ్ట్ డిజైర్ కారులో రాగా, ఒకరు పోలీస్ యూనిఫామ్‌లో ఉన్నారని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 59146, 87126 59147, 87126 59148 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

‘పీఎంశ్రీ’ స్కూళ్లకు కంప్యూటర్లు

- భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని 46 పాఠశాలలకు మంజూరు
- ఉమ్మడి జిల్లాలోని ఏడు ఎమ్మార్సీలకు కూడా..


పాఠశాలకు కేటాయించిన కంప్యూటర్లు

పాల్వంచరూరల్: పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్య అందనుంది. ఇందుకోసం కంప్యూటర్లను కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 46 స్కూళ్లకు డెస్క్ టాప్ కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరయ్యాయి. అలాగే, రెండు జిల్లాల్లో ఏడు ఎమ్మార్సీలకు సైతం కంప్యూటర్లు కేటాయించారు. వీటితో విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, గతంలోనూ పాఠశాలలకు కంప్యూటర్లు కేటాయించినా శిక్షకులను నియమించకపోవడంతో అవి అటకెక్కాయి. ప్రస్తుతం కూడా బోధకులను కేటాయించకపోతే అదే పరిస్థితి ఎదురవుతుందని పలువురు చెబుతున్నారు.

పాఠశాలల వివరాలిలా..

పీఎంశ్రీ పథకం ద్వారా భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల బాలికల టీడబ్ల్యూఆర్ ఈఐఎస్‌కు పది కంప్యూటర్లు, ఒక ప్రింటర్, రెండు యూపీఎస్‌లు కేటాయించారు. అలాగే, టేకులపల్లి మండలం కొయ్యగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, జూలూరుపాడు మండలం పాపకొల్లులోని జెడ్పీహెచ్ఎస్, అన్నపురెడ్డిపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, చుంచుపల్లి మండలం బాబుక్యాంప్‌లోని హైస్కూల్, కొత్తగూడెం కూలీలైన్ హైస్కూల్, లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం జెడ్పీహెచ్ఎస్, పాల్వంచలోని బాలుర టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, బాలికల జెడ్పీహెచ్ఎస్, బూర్గంపాడు మండలం సారపాకలోని జెడ్పీహెచ్ఎస్, భద్రాచలంలోని కొర్రాజులగుట్ట జెడ్పీహెచ్ఎస్, ములకలపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, దమ్మపేటలోని టీడబ్ల్యూఆర్ఈఐఎస్, పినపాక మండలం అల్లిరెడ్డిపల్లిలోని ఆశ్రమ పాఠశాల, దుమ్ముగూడెం మండలం రేగుబల్లిలోని బాలికల ఆశ్రమ పాఠశాలకు కంప్యూటర్లు, ఇతర సామగ్రి మంజూరయ్యాయి. అలాగే, అశ్వాపురం జెడ్పీహెచ్ఎస్, మణుగూరులోని బాలికల టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ, గుండాల మండలంలోని టీడబ్ల్యూఆర్ఈఐఎస్, సుజాతనగర్‌లోని జెడ్పీహెచ్ఎస్, దమ్మపేటలోని జెడ్పీహెచ్ఎస్, దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు కూడా కేటాయించారు. వీటితో పాటు ఖమ్మం జిల్లాలోని 25 స్కూళ్లకు కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరయ్యాయి. ఇవి ప్రస్తుతం మండల వనరుల కేంద్రాలకు చేరగా, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేస్తారు. ఇక భద్రాద్రి జిల్లాలోని ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, కరకగూడెం, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లితో పాటు ఖమ్మం జిల్లాలో ఒక ఎమ్మార్సీకి సైతం ఆరేసి కంప్యూటర్లు, ఒక ప్రింటర్, ఒక యూపీఎస్ మంజూరయ్యాయి.

మెరుగైన వైద్యసేవలతోనే గుర్తింపు


ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న వాసిరెడ్డి రామనాథం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా ఆస్పత్రులకు గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని అఖిల కంటి ఆస్పత్రి ఏడో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఓపీ చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అఖిల మాట్లాడుతూ నెలలు నిండకుండా జన్మించిన పిల్లల్లో రెటీనా సంబంధిత సమస్యలు ఎదురైతే వైద్యం అందించడం సంతృప్తిగా ఉందని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ మాధవి, మేనేజింగ్ డైరెక్టర్ కుతుంబాక మధుతో పాటు డాక్టర్ సమత, శ్రీధర్, సతీష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

బోనకల్: మండలంలోని రావినూతలలో బస్ డ్రైవర్, కండక్టర్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు. ఈనెల 16న ఖమ్మం డిపో బస్సు బోనకల్ మండలం లక్ష్మీపురం వెళ్లి వస్తుండగా ఓ సైక్లిస్ట్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సైకిల్ దెబ్బతినగా డ్రైవర్ షేక్ మస్తాన్ బాధితుడికి పరిహారంగా రూ.వెయ్యి ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇక 18వ తేదీన బస్సులో డ్రైవర్ మస్తానే ఉండగా రావినూతల జీపీ సమీపాన మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, షేక్ నాగుల్‌మీరా అడ్డుకుని ఆయనను కిందకు దించి సైకిల్ విషయమై ప్రశ్నించే క్రమాన అసభ్య పదజాలంతో దూషించారు. కండక్టర్ సంధ్యారాణి సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఫోన్ లాక్కున్నారు. ఘటనపై కండక్టర్ ఫిర్యాదుతో ఉపేందర్, నాగుల్‌మీరాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రఘునాథపాలెం: బాలికను కిడ్నాప్ చేసినట్లు అందిన ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు కిడ్నాప్ చేసినట్లు ఆమె కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీంతో బాలికను గుర్తించి ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా కిడ్నాప్ కేసును పోక్సో కేసుగా మార్చినట్లు సీఐ వెల్లడించారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

తిరుమలాయపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 30మందిని గురువారం ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ ఎదుట వారిని హాజరుపర్చగా రూ.2లక్షల పూచీకత్తు తీసుకున్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మితే ఏడాది జైలు లేదా రూ.2లక్షల జరిమానా విధించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం

వలస కూలీ కుటుంబంలో విషాదం

కారేపల్లి: మధ్యప్రదేశ్ నుంచి మిర్చి కోతలకు వచ్చిన కుటుంబంలో విషాదం నెలకొంది. ఓ కుటుంబంలో జరిగిన ఘర్షణతో భార్య కడుపులో భర్త బలంగా కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం తెలిపిన వివరాలు... మధ్యప్రదేశ్ రాష్ట్రం దుండూరి జిల్లా గాయత్రి మందిర్ గ్రామానికి చెందిన పలువురు మిర్చి కోతల కోసం వచ్చారు. కారేపల్లి మండలం జైత్రాంతండా శివారులో డేరాలు వేసుకుని ఉంటుండగా, ఇందులోని భార్యాభర్తలు మరవి పింకీ(40), కమలేష్ మధ్య బుధవారం ఉదయం గొడవ జరిగింది. ఈక్రమాన మాటామాటా పెరగడంతో కమలేష్ తన భార్య పింకీ కడుపులో బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని నిందితుడు అదుపులోకి తీసుకున్నారు.

చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

అశ్వారావుపేటరూరల్: ఓ చిన్నారి మృతిపై ఆలస్యంగా అందిన ఫిర్యాదుతో ఖననం చేసిన మృతదేహాన్ని గురువారం వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై టి.యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురానికి చెందిన నారదాసు రామకృష్ణ, వరలక్ష్మి దంపతుల నాలుగు నెలల చిన్నారికి ఈనెల 5న అశ్వారావుపేటలోని సబ్ సెంటర్‌లో టీకా వేయించగా 6న మధ్యాహ్నం మృతి చెందింది. అదేరోజు చిన్నారి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే, తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నట్లు రామకృష్ణ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించినట్లు ఎస్సై తెలిపారు.